

నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ ప్రజాఆశీర్వాద సభలో 'ధరణి ఉండాలి, 24 గంటల కరెంట్ కావాలి' అంటూ చేతులెత్తి ముక్తకంఠంతో నినదిస్తున్న మహిళలు, యువకులు

# కరెంట్ కావాల్నా? కాంగ్రెస్ కావాల్నా?

**ఆ పార్టీకి ఓటేస్తే రైతుబంధు మాయం.. అసైన్డ్ భూములకు పట్టాలిస్తాం**

**రేపోమాపో రైతుబంధు పైసలు.. దుబ్బాక సభలో మంత్రి హరీశ్‌రావు**

సిద్దిపేట, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కరెంట్ కావాల్నా..? కాంగ్రెస్ కావాల్నా? ప్రజలు ఆలోచించుకోవాలని మంత్రి హరీశ్‌రావు విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఆదివారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మంత్రి మాట్లాడుతూ.. రైతుబంధును కాంగ్రెస్ కాపీ కొట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు రాదని, రైతుబంధు కావాల్నా..? కాంగ్రెస్ కావాల్నా? ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎరువుల కోసం, లోన్‌ల కోసం, విత్తనాల కోసం, పంట ఉత్పత్తులు అమ్మడం కోసం, మంచినీళ్ల కోసం లైన్‌ల నిలబడ్డామని గుర్తుచేశారు. నేడు ఆ పరిస్థితి ఉన్నదా అని ప్రశ్నించారు. యాసంగిలో రైతుబంధు వేద్దామంటే కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని.. కానీ, న్యాయం, ధర్మం గెలుస్తుంది కాబట్టి ఎన్నికల కమిషన్ రైతుబంధు ఇవ్వడానికి అనుమతిచ్చినట్టు వెల్లడించారు. రేపోమాపో రైతులందరి ఫోన్లకు టింగ్‌టింగ్ మని రైతుబంధు పడ్డట్టు మెసేజ్ వస్తుందని చెప్పారు. కేసీఆర్ వచ్చిన తరువాత మిషన్ భగీరథ నీళ్లు ప్రతి ఇంట్లోకి వస్తున్నాయా? లేదా? ప్రతి మహిళ ఆలోచించాలని కోరారు. సీఎం కేసీఆర్‌కు బీడీలు చేసే కష్టం తెలుసు కనుక.. బీడీ కార్మికులకు పింఛన్ ఇచ్చి ఆదుకున్నారని చెప్పారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలవగానే మిగిలిన పింఛన్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. మిగిలిపోయిన రైతుల పంట రుణమాఫీ త్వర లో పూర్తి చేస్తామని స్పష్టంచేశారు. మొన్నటి వరకు అబద్ధపు హామీలు ఇచ్చిన నాయకులు.. నేడు భూములు తీసుకుంటారని ఇంకో కథ చెబుతున్నారని బీజేపీ నేతల తీరుపై మండిపడ్డారు. అసైన్డ్ భూములు ఉన్న ప్రతి లబ్ధిదారుడికి పట్టా భూములు ఇచ్చి యజమానులుగా మార్చుతామని హామీ ఇచ్చారు. 11 సార్లు చాన్స్ ఇస్తే ఎలాంటి అభివృద్ధి చేయని పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు.

# జైకొట్టిన జగిత్యాల.. దండుకట్టిన దుబ్బాక

**ఖానాపూర్ జనహోరు.. వేములవాడ నీరాజనం**

- కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు సూపర్ సక్సెస్
- ఊరూవాడా తరలివచ్చిన ప్రజలు..కిక్కిరిసిన రోడ్లు
- అంతటా నినాదాల జోరు.. కేరింతల హుషారు!
- ఇందిరమ్మ రాజ్యం మాకొద్దంటూ రణ నినాదం
- ధరణి, 24 గంటల కరెంటు కావాలంటూ తీర్మానం

కరీంనగర్/మంచిర్యాల/సిద్దిపేట, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జగిత్యాల నియోజకవర్గం జైకొట్టింది.. దుబ్బాక దండుకట్టింది.. ఖానాపూర్ జనం హోరెత్తగా, వేములవాడ నీరాజనం పట్టింది. మొత్తంగా ఆదివారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు సూపర్ సక్సెస్ అయ్యాయి. ఆయా సభల్లో ఇందిరమ్మ రాజ్యం మాకొద్దు.. అన్న నినాదాలు హోరెత్తగా, ధరణి, 24 గంటల కరెంటు కావాలి అన్న ప్రజల నినాదాలు మిన్నంటాయి. 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో, పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిపై గ్రామాల్లో చర్చ పెట్టాలంటూ సీఎం కేసీఆర్ ఆత్మవిశ్వాసంతో చెప్పిన మాటలు.. బీఆర్‌ఎస్ శ్రేణుల్లో మరింత అత్మవిశ్వాన్ని నింపాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం సాగినంత సేపు ఈలలు, కేరింతలతో జనం ఉప్పొంగిపోయారు. ఉద్యమాల గడ్డ జగిత్యాల, ఇలవేల్పు రాజన్న ఇలాకా వేములవాడలో ప్రజలు కదం తొక్కారు. తండోపతండాలుగా తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. సభలకు తరలివచ్చిన జనంతో రెండు పట్టణాలు కిటకిటలాడాయి. అనేక అంశాలపై కేసీఆర్ ప్రజలకు వివరించి చెప్పిన తీరు ఆకట్టుకున్నది. ఇందిరమ్మ రాజ్యంలో ఆనాడు ఈ ప్రాంత ప్రజలకు ఎదురైన అనుభవాలను కండ్లకు కట్టినట్టుగా వివరించిన తీరు అందరినీ ఆలోచింపచేసింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గ ప్రజాఆశీర్వాద సభ జనసంద్రాన్ని తలపించింది. పట్టణంలో ఎటు చూసినా జనమే కనిపించారు. జాన్సన్ నాయక్‌ను గెలిపిస్తే ఖానాపూర్ బాధ్యత తనదే అన్న కేసీఆర్ హామీకి జనం నుంచి చప్పట్ల వర్షం కురిసింది. దుబ్బాక సభకు దుబ్బాక, దుబ్బాక టౌన్, మిరుదొడ్డి, రాయపోల్, తొగుట మండలా ల నుంచి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. దుబ్బాక అంటే ప్రేమ అని, అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత నాదని.. కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించే బాధ్యత మీది.. అని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ప్రజలంతా గులాబీ కండువాలను గాల్లోకి ఊపుతూ హర్షాతిరేకం వ్యక్తం చేస్తూ మద్దతు పలికారు. నాలుగు నియోజకవర్గాల్లో ప్రజాఆశీర్వాద సభలు సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు మంచి మెజార్టీతో గెలుస్తారన్న ధీమా శ్రేణుల్లో వ్యక్తం కావడంతోపాటు.. పార్టీ నేతల్లో కొత్త జోష్ నిండుకుంది.



వేములవాడలో సభాప్రాంగణంలో జనం కిక్కిరిసిపోవడంతో వేదికకు దూరంగా బారికేడ్ల వద్ద కూర్చొని, నిల్చొని సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు

## • సరిహద్దులో డ్రోన్ పెట్రోలింగ్



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా పోలీసులు సరిహద్దులో డ్రోన్ పెట్రోలింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఆదివారం తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులో గల మంచిర్యాల జిల్లా వేమనపల్లి ప్రాణహిత నది వద్ద ప్రత్యేక కెమెరాలు గల యూనిట్‌ను ప్రారంభించినట్టు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి తెలిపారు. - వేమనపల్లి



జగిత్యాల పట్టణంలో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ ప్రజాఆశీర్వాద సభలో కళాకారుల పాటలకు గులాబీ కండువాలు ఊపుతూ స్వరం కలుపుతూ పదం పాడుతున్న ప్రజలు



**క్షీరగిరిపై అఖండజ్యోతి దర్శనం**

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం రాత్రి జనగామ జిల్లా పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి (క్షీరగిరి క్షేత్రం)పై అఖండ జ్యోతి దేదీప్యమానంగా వెలిగి 35 గ్రామాల ప్రజలకు దర్శనమిచ్చింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉత్తరకాశీ పీఠాధిపతి స్వామి స్థితప్రజ్ఞానందసరస్వతి పూజలు నిర్వహించి అఖండ జ్యోతి వెలిగించారు. అనంతరం సోమేశ్వరుడి ఆశీస్సులు తీసుకున్నారు. – పాలకుర్తి



కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం దేశాయిపేట్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గౌడ కులస్థులు అందించిన నీరా తాగుతున్న స్పీకర్ పోచారం

## బ్రోకర్‌కు హఠావో.. బీఆర్‌ఎస్‌కు జితావో

- బాన్సువాడ అభ్యర్థి స్పీకర్ పోచారం

బాన్సువాడ రూరల్/వర్ని, నవంబర్ 26: భూకబ్జాదారుడు, బ్రోకర్, బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏనుగు రవీందర్‌రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించాలని, నియోజకవర్గం ప్రజలతో నిత్యం వెన్నంటి ఉంటూ ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడుతున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడ, నిజామాబాద్ జిల్లా వర్ని మండలాల్లో ఎన్నికల ప్రచారసభల్లో మాట్లాడారు. అక్రమంగా దళితుల భూములను ఆక్రమించుకొని తిరగబడితే పోలీస్ స్టేషన్‌లో వేసి కొట్టించిన కబ్జాదారుడు ఏనుగు రవీందర్‌రెడ్డి అని విమర్శించారు. బ్రోకర్‌కు హటావో.. పోచారానికి జితావో అంటూ నినదించారు. ఈ సందర్భంగా గౌడ కులస్థులు అభిమానంతో తీసుకొచ్చిన నీరాను స్పీకర్ తాగారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## కార్ కా నిషాన్.. తెలంగాణ కా షాన్

- ముస్లింలకు నిజమైన శత్రువు కాంగ్రెస్సే
- ఆ పార్టీకి ఓటేస్తే కరెంట్, రైతుబంధు బంద్
- రోడ్‌షోలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బోధన్, నవంబర్ 26: 'కార్ కా నిషాన్.. తెలంగాణ కా షాన్ హై' అని కవిత అన్నారు. ఆదివారం బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి మండలం జాన్కంపేట్, నెహ్రూనగర్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్‌కు మద్దతుగా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు నిజమైన శత్రువు కాంగ్రెస్ పార్టీ అని, వారిని కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకుగా వాడుకొని వదిలేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ముస్లింలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముస్లింల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ఏమీ చేయలేదని, ఆ పార్టీ కుట్రలో పడొద్దని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మత కలహాలు జరుగుతున్నాయని, గతంలో ఇక్కడ కాంగ్రెస్ అధికారంలో ఉండగా తరచూ మత కలహాలు చెలరేగడం, కర్ఫ్యూలు విధించడం, భయంకరమైన పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క మతకల్లోలం కూడా జరగలేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్నివర్గాలను సమానంగా చూస్తున్నదని, ఆలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలకు రాష్ట్ర ఖజానా నుంచి డబ్బులు ఇచ్చిందని చెప్పారు. ఏ ఒక్క మతం పట్ల వివక్ష చూపకుండా పరిపాలించామని, లౌకికవాదం అంటే ఏమిటో ఆచరణలో చూపించినట్టు తెలిపారు.

**కాంగ్రెస్ వస్తే కష్టాలే..**

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇప్పటివరకు సీఎం కేసీఆర్ ఇస్తున్న కరెంట్, రైతుబంధు, ఆసరా పింఛన్లు బంద్ అవుతాయని, పాత కష్టాలు మళ్లీ పునరావృతవుతాయని కవిత హెచ్చరించారు. కేసీఆర్ సీఎం కాకముందు పొలాలకు నీళ్లు వచ్చేవి కావని, తాగునీరు, కరెంట్ ఉండేవి కావని, అరకొర పింఛన్లు మాత్రమే ఇచ్చేవారని, రైతుబంధులాంటి పథకాలు లేవని గుర్తుచేశారు. మళ్లీ ఆ కష్టాలు రాకూడదని, ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలతోపాటు తెలంగాణ ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు.



ఎడపల్లి మండలం జాన్కంపేట్ రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్



**బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిరుద్యోగుల బైక్ ర్యాలీ**

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన 150 మంది నిరుద్యోగ యువకులు బీఆర్‌ఎస్ మద్దతుగా ఆదివారం బైక్ ర్యాలీ నిర్విహించారు. గంధంపల్లి, సింగారం, సంత్రాలపోడ్ తండా, కోటగడ్డ, నామాపాడు, సత్యనారాయణపురం గ్రామాల మీదుగా ఈ ర్యాలి కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ.. తెలంగాణకు సీఎం కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని కొనియాడారు.

–బయ్యారం

## బాసరలో ఆర్జీయూకేటీ విద్యార్థి ఆత్మహత్య



ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

బాసర, నవంబర్ 26: బాసరలోని రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ)లో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి వ్యక్తిగత కారణాలతో ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తికి చెందిన రామాటి చంద్రయ్య, పద్మ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరిలో రామాటి ప్రవీణ్‌కుమార్ (18) పెద్దవాడు. ఆరు నెలల క్రితం తల్లి పాము కాటుతో మృతిచెందింది. అనంతరం ట్రిపుల్ ఐటీకి వచ్చిన ప్రవీణ్ ఇప్పటివరకు ఇంటికి వెళ్లలేదు. ఔట్ పాస్ ఇస్తే.. ఓటు వేయడానికి ఇంటికెళ్తానని అభ్యర్థించగా అధికారులు జారీ చేశారు. ఉదయం 10 గంటలకు బయలుదేరాల్సి ఉండగా.. అల్పాహారం అనంతరం విద్యార్థి బీహెచ్-2 వసతి గృహంలోని ఖాళీ గదిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ట్రిపుల్ ఐటీ అధికారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా దవాఖానకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.